# కొరివిదయ్యం

ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ



"అట్లతద్దోయ్! ఆరట్లోయ్!
ముద్దపప్పోయ్! మూడట్లోయ్!
పీటక్రింద పిడికెడు బియ్యం-
పిల్లల్లారా-జెల్లల్లారా లేచి
రండోయ్!"

పిల్లలుపాడుతున్నారు. పడుచులు పకపకలతో వంతపలుకుతున్నారు. చల్లగాలివాళ్ళ పాటకు శృతి పెడుతోంది. కొబ్బరిచెట్లు నాట్యం చేస్తున్నట్లు తలూపుతున్నాయి. కీచురాళ్ళు సన్నాయినాదంచేస్తున్నాయి.

పల్లె ఇంకా మేల్కొ లేదు. సూర్యుడు ఇంకామరో రెండుగంటలైతేకాని తన దినచర్య ప్రారంభిం

వేదు. నాగమణి ఉల్లిపాయి పులుసుతో వద్ది అన్నంతినేసి వీధి వాకిట తెరిచింది. ఆమె పదహారేళ్ళ పడుచుదనాన్ని చూసి ఆగలేని చల్లగాలి ఆమెను చుట్టేసింది. చేతులు ముడేసి భుజాలమీదేసుకుని మునగదీసుకుంది నాగమణి.

"జాగ్రత్త దూరంవెళ్ళకు. లలితవారి దొడ్లోనే ఆడుకోండి" అరిచింది తల్లి పక్కమీంచి.

"అలాగే! నువ్వు పడుకో" అంటూ తలుపు దగ్గరగా మూసి వోణితలమీంచి తీసుకుని వీధిలో కొచ్చించి నాగమణి గుమ్మం దిగగానే అల్లరిగాలి ఆమెను చుట్టేసింది.

"గురూ! అదిగో సీ హీరోయిన్" అన్నాడు కాఫీ మంత్రి.

రాజు తలూపేడు.

"గురూ! ఓ సిగరెట్ ఇలా పడేయ" చేయిజాపేడు సిగరెట్ మంత్రి.

సిగరెట్ అందించేడు రాజు.

రాజు పేరు వెంకట్రాజు. వందెకరాల మగాణికీ, ఓ మిద్దె ఇంటికి సొంతదారుడైన రామచంద్రయ్య ఏకైక వారసుడీ నూనుగు మీసాల వెంకట్రాజు. ఏ రాజుకైనా, రాజకీయ నాయకుడికైనా కొంత పరివారం ఉంటుంది. అలాగే వెంకట్రాజుకి కొందరు మంత్రులున్నారు. సిగరెటు మంత్రి, కాఫీ మంత్రి, మందు మంత్రి, సినిమా మంత్రి, ఇలా ఒక్కొక్క డిపార్టు కొక మంత్రి.

అందులో చాలా మంది మంత్రులు సూర్యోదయం చూడనవి ఒట్టువేసుకోవటంవల్ల ఇంకా మంచాలు దిగలేదు. ప్రస్తుతం రాజు దగ్గర ఇద్దరే ఉన్నారు.

"గురూ.... సెంటర్‌లో కాఫీ హోటల్ తెరిచేవేళ అయిందంటావా?" అడిగేడు కాఫీ మంత్రి, సిగరెట్ మంత్రిని

"ఉందరా! ఇప్పుడేనా హీరోయిన్ సీనులో కొచ్చింది" గదమాయించేడు సిగరెట్ మంత్రి పొగ ఊదేస్తూ.

నాగమణి తన గుమ్మందిగి నాలుగిళ్ళ అవతలున్న మరో ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"అదిగో ఎగ్జిట్! అదసలు మాట్లాడటానికి చాన్సు ఇవ్వటం లేదు" నిట్టూర్చేడు రాజు.

"గురూ! ఊయల ఊగటానికి పెద్ద మావిడిచెట్టుకి వెళుతుందిగా! అప్పుడు తేలుద్దారి. ఈలోగా ఓ కాఫీ లాగించి వద్దాం రా గురూ!" అన్నాడు కాఫీ మంత్రి.

"నేనురాను. మీరు వెళ్ళిరండి.

నేను ఇక్కడే ఉంటాను" అన్నాడు రాజు నాగమణి వెళ్ళిన ఇంటికేసి చూస్తూ కాఫీమంత్రి ఏదో నసిగాడు. రాజు జేబులోంచి రెండు రూపాయల నోటుతీసి ఇచ్చాడు మంత్రులు విష్క్రమించారు.

రాజు ఒంటిగా జంక్షన్ దగ్గర నిలబడ్డాడు. సిగరెట్ ముట్టించాడు. చేతులు సన్నగా వణుకుతున్నట్టు పసిగట్టి సిగ్గుపడ్డాడు పెదాలు తడుపుకుని సిగరెట్ కాలుస్తూ నాగమణి వెళ్ళిన ఇంటికేసి చూస్తున్నాడు. 'రోడ్డు నిర్మానుష్యంగా ఉంది ఆమె వస్తే బాగుండును' గొణుక్కున్నాడు.

నాగమణి ఆ ఇంట్లోంచి బయట కొచ్చింది. ఇంత త్వరలో రావను కున్న రాజు కంగారుపడ్డాడు. ఆమె గబగబా నడిచివస్తోంది.

వెంకట్రాజు వంట్లోంచి సన్నటి వణుకు ప్రారంభమైంది. 'సమయా నికి వీళ్ళులేరు' మంత్రులమీద మనసులో విసుక్కున్నాడు.

నాగమణి జంక్షన్ దగ్గరకొచ్చిన తర్వాత అక్కడున్న ఆకారాన్ని చూసింది. అడుగు ముందుకుపడ లేదు స్వతహాగా ధైర్యస్థురాలైనా ఒంటరితనం, చీకటి, గుర్తు తెలి యని ఆకారం ఆమెలో కంగారు పుట్టించేయి.

వెంకట్రాజు మెల్లిగా నాగమణి కేసి అడుగేశాడు.

"ఎవరదీ" గొంతు పొడారి పోతుంటే అడిగింది నాగమణి. వెంకట్రాజు మాట్లాడలేదు ఆమె కంగారు గమనించి ధైర్యంగా మరో అడుగు ముందుకేశాడు.

"ఏయ్! ఎవరు నువ్వు...." దాదాపు అరిచినంత పనిచేసింది నాగమణి.

ఆమె అరుపుకు వెంకట్రాజు భయపడ్డాడు.

"నేనూ....! దత్తుడిగారి వెంక ట్రాజుని" నసిగేడు.

నాగమణి అరవబోయింది, ఆగి పోయింది. చాలా రోజులుగా వెంకట్రాజు పరివారంతో వెంట పడటం ఆమె గమనిస్తూనే ఉంది. పొలంకేసి వెళ్ళినా గుడికెళ్ళినా... ఎలా కబురు అందుతుందో హాజ రయిపోతున్నాడు. ఒక్కడు ఉంటే ఫరవాలేదు. అంతగా రెచ్చిపోడు. అదే పరివారం ఉంటే 'పులి' అయి పోతాడు. నోటికొచ్చిన వాగుడు. విసుర్లు. తండ్రితో చెప్పినా రెండక రాల బక్కరైతు. దత్తుడి కొడు కును అదలించగలవాడుకాదు. చెప్పి తండ్రిమనసు క్షోభపెట్టడం ఇష్టం లేక సహిస్తోంది నాగమణి.

ఎంత చీకటైనా. మరో ప్రాణి

దగ్గరలేకున్నా వెంకట్రాజు ఒంటిగా ఉండటంతో ధైర్యం తెచ్చుకుంది నాగమణి. పక్కవించి వెళ్ళిపోయింది.

"నాగమణీ! నాగమణీ! నీతో ఓ మాట మాట్లాడాలి ఆగు నాగమణీ" అనుసరించేడు వెంకట్రాజు.

నాగమణి మాట్లాడలేదు. గబగబా నడుస్తోంది.

"విన్నే! ఒక్కసారి ఆగు..."

"నాగమణీ! పక్కనేగా.... మా మకాం ఓమాట వినేసివెళుదువు గాని రా! ఇదిగో! ఇదిగో! ఐదు నిమిషాలు" వెంకట్రాజు మాటలు నాగమణి చెవుల్లో పడగానే ఈసారి ఆమెకు కాళ్ళు వణుకు పుచ్చుకున్నాయి. పరుగుతీసింది. వెనక్కి తిరిగి చూడకుండానే. స్నేహితురాళ్ళున్న మావిడితోటలోకి పరుగుతీసింది.

నాగమణి పరుగెత్తుతుంటే వెంకట్రాజు కేం చేయాలో తోచలేదు. వెళ్ళి చేయిపట్టుకుంటే నోరు నొక్కి మకాంకి ఈడ్చుకెళితే, ఇవన్ని ఆలోచనల్లో ఉండగానే ఆమె పారిపోయింది.

మంత్రులు తిరిగొచ్చారు. జరిగింది విని

"అదేంటి గురూ! భలే ఛాన్సు మిస్‌చేశావు. పాక ఎనక్కిలాగేసి వాటేసుకుంటే సరిపో నే!" అన్నాడు కాఫీ మంత్రి.

వెంకట్రాజు నిట్టూర్చి సిగరెట్ ముట్టించేడు. పెట్టె అందుకుని మంత్రులు ముట్టించేరు.

అట్లతద్ది వెళ్ళిన నాలుగోరోజు రోడ్డువారనున్న తూముమీద కూర్చున్నాడు వెంకట్రాజు. తూము వెనుక మందు మంత్రి అని పిలవబడే ప్రసాద్ కూర్చుని క్వార్టర్ బాటిల్ ఓపెన్‌చేస్తున్నాడు. చీకటి ముసురుకుంటోంది. రాజు తూము మీదకూర్చుని రోడ్డుకేసి పరీక్షగా చూస్తున్నాడు.

తూము వెనక కూర్చున్న మందు మంత్రి బాటిల్ ఓపన్‌చేసి రాజుకోగ్లాసు అందించి, తనో గ్లాసులో పోసుకున్నాడు.

"రాజ్ బాబ్! అసలు అట్లతద్ది నాడు చీకట్లో కేసు రైట్ అయిపోవాలి. పెండింగ్ పెట్టేశావు. పోనీ మొన్న పొలంగట్టుమీద చేయి పట్టుకున్నవాడివి కుప్పల్లోకి లాగేసి తుప్పవదలగొట్టేయద్దు...ఛ...ఛ.. లాభంలేదు గురూ! ఈసారి వైజాగ్ వెళ్ళినపుడు లెటర్ ఇస్తా మా పిట్టల్ గాడ్ని కల్సుకో... వాడితో తిరిగితే నాలుగు రోజుల్లో నీకు అన్ని విద్దెలు వచ్చేస్తాయి. ఇక పిట్టల వేటలో ఎదురుండదు. మా పిట్టల్

గాడి అసలు పేరు పీటర్.... రోజుకో పిట్టని వేటాడుతాడు...." మధ్య, మధ్యలో మందు కొడుతు ఉపన్యాసం కొనసాగించేడు మందు మంత్రి.

"అదిసరే! ఇంతకి నాగమణి వస్తుందా?" అడిగేడు రాజు రోడ్డు కేసి చూస్తూనే.

"లలితని, 'సినిమాకి వెళదాం వస్తావా!' అని అడుగుతుంటే విన్నాను బాస్! లలితరానంది. అయితే నేవెళతానంది నీ హీరోయిన్....రావాలి. చూడు ఎవరో వస్తున్నారు" అన్నాడు మందు మంత్రి.

ఇద్దరూ కంగారుగా తూము వెనక చేరారు.

"వచ్చేది నాగమణే అయితే తూముమీదకి రానిచ్చి ముందు నువ్వెళ్ళు. వెనకగా నేను వస్తాను. ఆ కుప్పల వెనక్కి లాక్కుని పోవాలి" మరోసారి హెచ్చరించేడు మందు మంత్రి.

"మనం వదిలేసిన తర్వాత గొడవచేస్తే" సందేహంగా అడిగేడు రాజు.

"గురూ! వేటుపడని పాము... ఆడది .. అగు తర్వాత చెప్తాను" సర్దుకున్నాడు మందు మంత్రి. ఇద్దరూ తూమువెనక ఊపిరి బిగబెట్టి రోడ్డుమీద నడిచొస్తున్న పిల్ల కేసి చూశారు.

"ఛ! ఛ! నాగమణి కాదుగురూ! కొత్తపిల్లి కోటయ్య చిన్నకూతురు లే....లే...." అన్నాడు మందు మంత్రి. ఇద్దరూ లేచినిలబడ్డారు. మళ్ళీ అందుకున్నాడు మంత్రి.

"ఆ! ఏం చెబుతున్నాను. అదీ, డైరీ ఉంటే ఎక్కించేసుకో! గోల్డెన్‌వర్డ్స్.... వేటుపడని పాము ఆడది కస్సుమంటాయి. ఐతే వేటుపడ్డాక కస్సుమనవు. కస్సుమంటే జనం నలుగురూ రాళ్ళు... రాళ్ళలాంటి మాటలు విసురుతారు. అందువల్ల పెళ్ళి కావాలనుకుంటే నాగమణి అల్లరెట్టుకోదు...."

"ఇంకా ఎంతసేపూ?" అసహనంగా అడిగేడు రాజు.

"వెయిట్ చేయాలి పెళ్ళికొడకా! తోడిపెళ్ళికొడుకుని నీ తర్వాత లైనులో ఉన్నోడిని, నాకు కంగారు లేదా? అందాకా ఈ గ్లాసులాగించేయి. కాస్త స్టడీగా ఉంటావు" గ్లాసు అందించేడు మంత్రి.

చీకటి పూర్తిగా ముసురుకుంది. ఊరికి కాస్త దూరంగా ఉన్న సినిమాహాలులో రికార్డ్స్ ఆపి న్యూస్ వేస్తున్నారు. రాజు, మంత్రి మందు కొడుతు ఓప్స్ నముల్తున్నారు.

తూము వెనకాలనించి రోడ్డుకేసి చూస్తున్న రాజు లేచి విసుగ్గా సిగరెట్ ముట్టించేడు.

చీకటి నల్లగా వాళ్ళ మనసుల్లో కోరికలా వికృతంగా ఉంది. కీచురాళ్ళ అరుపులు వినబడుతున్నాయి.

హాల్లో సినిమా మొదలై పావు గంటయింది. నాగమణి జాడలేదు.

"ఇహ రాదేమో" అన్నాడు రాజు.

"అలాగే ఉంది ప్రోగ్రాం డ్రాప్ చేసుకుందేమో! ఓ.కె. బాస్ సారీ గివ్ మి టైమ్. ఐ విల్ గెట్ హర్" ముద్దగా అన్నాడు మంత్రి.

"ఏం చేద్దాం" నిట్టూర్చాడు రాజు.

"మందులో ఇంటికెళితే మా నాన్న మక్కెలు విరుస్తాడు. సో సినిమాకు పోదాం."

"నేను రాను ఇంటికెళ్ళాలి" చిరాకుగా అన్నాడు రాజు.

ఓ.కె. గురూ! నీ మూడ్ బాగో లేదు. సారీఫర్ ది డిజపాయింట్మెంట్ నేను సినిమాకు లాగేస్తా" తూలుకుంటూ సినిమాహాలు కేసి వెళ్ళిపోయాడు మందుమంత్రి.

రాజు వెనక్కి తిరిగి ఇంటిదారి పట్టాడు. రోడ్డు నల్లటి త్రాచులా ఉంది. ఆతనికి తల దిమ్ముగా ఉంది. నెమ్మదిగా నడుస్తున్నాడు. రోడ్డు కిరుప్రక్కలా ఉన్న పంట పొలాల్లోంచి కీచురాళ్ళ శబ్దం వినబడుతోంది. కళ్ళు మత్తుతో మసక కమ్ముతుంటే జోగుతూ నడుస్తున్నాడు రాజు.

"ఘల్లు ఘల్లు" గజ్జెల శబ్దం వినిపించింది.

"ఎక్కడా!" రాజు ఆశ్చర్యపోయాడు. చెవులు రిక్కరించి విన్నాడు.

"ఘల్లు ఘల్లూ" పంట పొలాల మధ్యనుంచి వస్తోంది.

ధాన్యలక్ష్మి గజ్జెలతో నాట్యం చేస్తుందని చెప్పేవాడు తాత ఇదేనేమో గొణుక్కుంటూ చూశాడు రాజు.

పంట పొలాలమధ్య వెలుగుతున్న మంట కనపడింది. మంట కదులుతోంది. కళ్ళు చిట్లించి చూశాడు రాజు. మంట భూమికి ఎత్తులో వుంది. దానిక్రింద నల్లటి ఆకారం.... ఆకారం కదుల్తోంది. దానితోపై నున్న మంటా కదులుతోంది. ఆకారం నల్లగా ఉంది. చేతులు బారసాచి 'గల్లు గల్లూమని శబ్దంవేస్తూ రోడ్డుమీద కొస్తోంది.

రాజు బిగుసుకు పోయాడు. భయంతో రోమాలు నిక్కబొడుచుకున్నాయి. "కొరివి దయ్యం-కొరివి దయ్యో" భయంకరంగా అరిచాడు

అతనికేక అతని చెవికే వినపడటం లేదు. ఒళ్ళంతా తడిసిముద్దయింది. గజ్జెలశబ్దం దగ్గరయింది.

శ్రీ ఆంజనేయం....ప్రసన్నాంజనేయం" దండకం రాజుకి గుర్తు రాలేదు. అదే ముక్క పదిసార్లు చదువుతూ ఒణికిపోతూ విలబడ్డాడు.

గజ్జెల శబ్దం చెవిలో మారుమ్రోగుతోంది. కళ్ళు మూసుకొని దండకం చదువుతుంటే నోరు సహకరించడంలేదు. నాలికమీద తడిలేదు. వెలుతురు దగ్గరయినట్లు తెలుస్తోంది ఇంకా గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

నడ్డిమీద చరిచింది ఆకారం.

"కెవ్వు" మని కేకవేస్తూ విరుచుకొని పడిపోయాడు రాజు.

* * *

నెల రోజులుగా వెంకట్రాజు మంచం దిగడంలేదు. దీపం కనపడితే చాలు "కొరివిదయ్యం" అంటూ విరుచుకునిపడిపోతున్నాడు.

మంత్రవేత్తలు 'దయ్యం పట్టిందన్నారు'.

డాక్టర్లు 'పిచ్చి' అన్నారు.

పురోహితులు "గ్రహస్థితి! శనికి జపం చేయించండి" అన్నారు.

రామచంద్రయ్య ఏది మానలేదు. ఆరులక్షల ఆశాదీపం ఆరిపోతుందనే భయం అతనిచేత ముళ్ళు విడదీయించింది. మూటలు కదిపింది. ఐనా ప్రయోజనం కనపడలేదు. రాజు మంచం దిగటంలేదు. గదిలో దీపం వెలిగిస్తే 'కొరివి దెయ్యం' అని అరుస్తున్నాడు.

బొద్దుగా ఉండే రాజు ఈను పుల్లయిపోయాడు.

"ఇదేదో మొండి పిశాచి మా వల్ల కాదు" అనేశారు మంత్రవేత్తలు.

"ఇహ నేడో రేపో!" అన్నారు డాక్టర్లు

"జపాలు చేయించినా కర్మఫలం తప్పుతుందా?" అన్నారు పురోహితులు.

చీకటిపడుతోంది. ముక్కోటి దేవతలకు మొక్కుకుంటూ అరుగు మీద కుర్చీలో కూర్చున్నాడు రామచంద్రయ్య. లోపల చీకటి గదిలో ఉన్నాడు రాజు.

నెత్తిమీద కొరివితో నల్లటి ఆకారం చేతులు చాచి ఆ ఇంటి గుమ్మం ఎక్కింది.

"ఏమిటికి ఎవరు నువ్వు?" కంగారుగా లేచాడు రామచంద్రయ్య.

"ఉష్!" అంటూ ఆతన్ని వారించి ఆకారం ఇంట్లో ప్రవేశిం

చింది. రామచంద్రయ్య నిలువుగుడ్లు వేసి నిలబడిపోయాడు.

ఆకారం రాజుగదిలో ప్రవేశిం చింది.

"దయ్యం...... దయ్యం...... కొరివిదెయ్యం" దాదా కూలిపడేంత అరుపు అరిచేడు రాజు.

ఆకారం పగలబడి నవ్వింది.

"దెయ్యం....కొరివి"

ఉష్! ఏమిటాగోలం... నేనూ.. నాగమణిని పిచ్చిపట్టినట్టు ఆ కేక లేంటి" అంది నాగమణి.

రాజునోరు మూతబడింది. అలా చూస్తుండిపోయాడు నాగమణి తలకు, నల్లగుడ్డతో కట్టిన కాగడా విప్పి ప్రక్కన పారేసింది. కట్టు కున్న బురఖావదిలి ముఖంతుడుచు కుంది.

"నాగమణి నువ్వా" చాలా కాలం తర్వాత రాజునోటి వెంట వచ్చిన మొదటిమాటది.

"అవును......నేనే......నన్ను రేప్ చేయాలని చూశావు ఆ రోజు తప్పించుకున్న మరో రోజు కాటే స్తావు. డబ్బు విషం ఒంటినిండా ఎక్కిన త్రాచువి. నిన్ను బెదర గొట్టాలనే చేశాను. లలిత పాయంతో బెదరగొట్టాను. నువ్వు మంచం ఎక్కితే పీడవిరగడయిం దనే సంతోషించేను. కాని అలో చిస్తే...నావల్ల ఓ ప్రాణం బలికా కూడదనిపించింది. అందుకే వచ్చాను. ఈ విషయం నా తండ్రితో చెప్పకోలేక నీ నుండి రక్షించుకోలేక.... నేనే చేశాను. రా ఎప్పటికైనా కాటేస్తావు.... రా... ఇదిగో వచ్చేను. నన్నేం చేస్తావో చేయి. ఒంట్లో శక్తి లేకున్నా డబ్బుబలం ఉందిగా రా! నా బ్రతుకు బుగ్గిచేయి" ఆవేశంగా అంది నాగమణి. రాజు తలదించు కున్నాడు.

తలుపుదగ్గర నిలబడి వింటున్న రామచంద్రయ్య కోపంతో ఊగి పోతు లోపలకొచ్చేడు.

"ఎవర్రా అక్కడా! నా బాబుని మంచమెక్కించిన ఈ దిక్కుమా లిన దాన్ని గొడ్లపాకలో కట్టి పారే యండిరా" అరిచేడు రామ చంద్రయ్య.

పాలేర్లు ఇద్దరూ చెరో రెక్క నాగమణిని పట్టుకున్నారు.

రామచంద్రయ్య పాలేరు చేతిలో కర్రలాక్కుని నాగమణి మీద ఎత్తేడు.

"ఆగండి. ఆమెదేం తప్పు లేదు. ఆమెమీద మీరు చేయివేస్తే మీకు కొడుకులేనట్టే" అరిచేడు రాజు రామచంద్రయ్య చేతిలో కర్ర క్రిందకు దిగింది. *